క్లుప్తంగా

దశాబ్ది దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: కలెక్టరేట్ ఆవరణలో జూన్ 2 శుక్రవారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ నగేష్, ఏఓ మహిపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి కేసీఆర్ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దావాఖానలో 59రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, నాగమణి, బీఆర్‌ఎస్ కాలనీ అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

చెత్తతో జనం బేజార్



రోడ్డు పక్కన చెత్తకుప్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీకాలనీ నుంచి బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌కు వచ్చే మార్గంలో రోడ్డు పక్కన చెత్త ఉండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త వేయరాదని బోర్డులు ఉన్నప్పటికీ దానిని ఎవరూ పట్టించడంలేదు. దీంతో వాహనదారులకు నరకయాతన తప్పడంలేదు. సమస్యను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ అధికా రులకు పలుమార్లు విన్నవించినా రోడ్డు బెల్ టౌన్‌షిప్ పరిధిలో ఉందని సమాధానం చెబుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య ను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామకంఠం స్థలాన్ని కబ్జా చేయటం సరికాదు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని గ్రామకంఠం స్థలాన్ని కబ్జా చేసి పరిశ్రమలకు రోడ్డు చేయటాన్ని గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు అధికారులతో కుమ్మక్కై గ్రామ కంఠం స్థలాలను కబ్జాలు చేస్తూ రోడ్లు వేయడం సరైందికాదని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్థానికంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామకంఠం స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'రైతుబంధు' మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

మునిపల్లి(అందోల్): కొత్తగా కొనుగోలు చేసిన భూములకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టా పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను రైతువేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలన్నారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పత్తి విత్తనాలతో పాటు మరే ఇతర విత్తనాల్లో ఏమైన కల్తీ ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

10న జాతీయ లోక్ అదాలత్

నారాయణఖేడ్: ప్రథమశ్రేణి జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, వివాహబంధాలు, చిన్నచిన్న చోరీలు, ఇసుక, మట్టి, మద్యం, ఇతర అక్రమ రవాణా, పేకాట, లాక్‌డౌన్ తదితర కేసుల్లో ఉన్నవారు పరస్పర అంగీకారంతో రాజీ అయ్యే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కేసులు పరిష్కరించుకునేందుకు ఆసక్తి ఉన్న ఫిర్యాదుదారులు, నేరస్తులు ఆధార్‌కార్డులు తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు లేదా కోర్టుకు రావాలని సూచించారు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట గ్రామాల్లో నిర్మిస్తున్న ఫంక్షన్ హాళ్లు, దాయర నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కేసీఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వరసిద్ధి వినాయక దేవాలయం శంకుస్థాపనకు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, సర్పంచులు కృష్ణ, భాస్కర్‌గౌడ్, వైసీపీ సునీతాసత్యనారాయణ, నాయకులు రాజు, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్ పాల్గొన్నారు.

వీఓఏలకు ఎమ్మెల్యే చేయూత

గ్రామ స్థాయిలో మహిళా సంఘాల బలోపేతంలో కీలక భూమిక పోషిస్తున్న గ్రామైక్య సంఘం సహాయకులు (వీవోఏ)లకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేయూత అందించారు. నియోజకవర్గ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, గ్రామాలలో పనిచేస్తున్న 200 మంది వీఓఏలకు రూ.6 లక్షలతో కొనుగోలు చేసిన రెండు జతల ఏకరూప దుస్తులు, ఐడెంటీ కార్డులను పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడ గ్రామంలో గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్న సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.1.50లక్షల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఎమ్మెల్యే సన్మానం



సన్మానం పొందిన అధ్యాపకులతో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఏడుగురు జూనియర్ అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించిన నేపథ్యంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని గురువారం క్యాంపు కార్యాలయంలో అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అధ్యాపకులను సైతం ఎమ్మెల్యే సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

ఖేడ్ పట్టణ శివారులో పంచగామ కమాన్ నుంచి పంచగామ, రాణాపూర్‌ల మీదుగా తుమ్నూర్ వరకు రూ.6కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మనూరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావుపాటిల్, ఖేడ్ మండల ఉపాధ్యక్షులు జుబ్రు నర్సింహులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలోని దత్తాత్రేయ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. బర్దీపూర్ దత్తాత్రేయ ఆశ్రమ పీఠాధిపతి అవధూత్‌గిరి మహారాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌తో పాటు వివిధ ఆశ్రమాల పీఠాధిపతుల ఆధ్వర్యంలో దత్తాత్రేయస్వామి, రేణుకామాత, నవగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్ పాల్గొన్నారు.

మనూరు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని తుమ్నూర్, పుల్‌కుర్తి గ్రామాల్లో ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తుమ్నూర్‌లో రూ.23లక్షలతో మంచినీటి ట్యాంకుకు భూమి పూజ చేశారు. అదేవిధంగా రూ.30లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పుల్‌కుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఊరడమ్మ ఆలయంలో పూజలు చేశారు. పంచగామ నుంచి రాణాపూర్, తుమ్నూర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కంది జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సరళపుల్లారెడ్డి అన్నారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి మూడు వారాల పాటు నిర్వహించే వేడులను ఘనంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏపీడీ జయదేవ్ అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవదాసు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుజాత, ఎంపీఓ లక్ష్మయ్య, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జోగిపేట(అందోల్): అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోగిపేట అగ్నిమాపక ఉన్నతాధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న బావార్చి హోటల్‌లో సిలిండర్‌తో ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు, గ్యాస్ లీక్ అయినా మంటలు చెలరేగినా ఏ విధంగా నివారించాలనే విధానంపై అవగాహన కల్పించారు.అనంతరం అగ్నిమాపక ఉన్నతాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను తట్టుకునేందుకు షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, ఇతర వ్యాపార సముదాయాలతో పాటు నివాసాల్లో ఏసీలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడి మనోధైర్యాన్ని కోల్పోకుండా వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన పోలీసులకు సత్కారం



పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్: సబ్ డివిజన్‌లో పదోన్నతి పొందిన డీఎస్పీ రఘు, సీఐ భూపతిలకు గురువారం ఉన్నతాధికారులు పదోన్నతి పత్రాలను అందజేశారు. ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కాంతారావు, చిరాగ్‌పల్లికి చెందిన శ్రీనివాస్, ఎంఏ రజాక్, ఝరాసంగంకు చెందిన కృష్ణయ్య ఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అంజయ్య, వెంకటేశం, యాదయ్య, విజయ్‌కుమార్ ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు.

పీహెచ్‌సీ మంజూరుపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

వట్‌పల్లి(అందోల్): మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించడంపై ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు స్థానిక సర్పంచ్ సురేఖ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఆమె సాక్షితో మాట్లాడుతూ పీహెచ్‌సీ అందుబాటులో లేకపోవడంతో అందోల్ మండలంలోని తాలెల్మ పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం చేయించుకోవడంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ నేపథ్యంలో వట్‌పల్లి మండలానికి పీహెచ్‌సీని మంజూరు చేయించడంపై ప్రజల పక్షాన మంత్రి హరీష్‌రావుకు, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

హోంమంత్రిని కలిసిన ఆర్డీఓ

సంగారెడ్డి టౌన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు హాజరుకావాలని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని కోరినట్టు ఆర్డీఓ రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతువేదికల పరిశీలన



మునిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరా, మునిపల్లి గ్రామాల్లో గురువారం జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య రైతువేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరిని భాగస్వాములను చేయాలని సూచించారు. అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, నాయకులు ఆత్మకూర్ నాగేష్, దేవిసింగ్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గడ్డపోతారం గ్రామపంచాయతీ సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం గ్రామపంచాయతీని గురువారం డీపీఓ సురేష్‌మోహన్ సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్య నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామకంఠం స్థలం నుంచి పరిశ్రమకు రహదారి వేయటాన్ని స్థానికులు డీపీఓకు ఫిర్యాదు చేయగా ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీనిచ్చారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్

నారాయణఖేడ్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్ అన్నారు. నారాయణఖేడ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రకటనలుగానే మిగిలిపోతున్నాయన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడం, లారీల కొరతతో వర్షాలకు ధాన్యం తడిసి ఓవైపు రైతులు నష్టపోతుండగా మరోవైపు క్వింటాలుకు ఐదారు కిలోల తరుగు పేరుతో మరింత నష్టపోయి రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాహెర్, సుభాష్‌రావు పాటిల్, వీరశెట్టి, సాయిలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని తగ్గించాలి



జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న సర్పంచ్

వట్‌పల్లి(అందోల్): ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వట్‌పల్లి సర్పంచ్ సురేఖ అన్నారు. గురువారం సంగారెడ్డి హోప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పర్యావరణ జీవనశైలిపై వట్‌పల్లిలో స్థానికులకు అవగాహన కల్పించి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా ప్రతిఒక్కరూ పేపరు కవర్లు, జూట్ బ్యాగులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి పాల్గొన్నారు.

నారాయణకు సన్మానం



నారాయణను సన్మానిస్తున్న శివశంకరరావు, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నారాయణను బీఆర్‌ఎస్ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు శివశంకరరావు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివశంకర్‌రావు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

నేడు జెండావిష్కరణ

మునిపల్లి(అందోల్): ఈ నెల 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉప తహసీల్దార్ కృపాదానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జెండావిష్కరణ ఉంటుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో పరిధిలో నెల కొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కటికబస్తీలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి కుమార్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, తాగునీటి, రోడ్డు సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శివకుమార్, సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ పట్టణంలో అల్ ఫతే సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను గత మూడు రోజులుగా నిర్వహించారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని అల్ ఫతే దౌల్తాబాద్ జట్టు దక్కించుకోగా ఇస్లామీయ జట్టు రన్నర్ కప్ (రెండవ స్థానంలో) నిలిచింది. ఈ గెలుపును స్వాగతిస్తూ హత్నూర జామ మసీద్ ప్రెసిడెంట్ అబ్దుల్ హాది, వార్డు సభ్యుడు, యూత్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖదీర్, యూత్ కాంగ్రెస్ సభ్యులు ఖదీర్, వాజితుల్ మైనారిటీ అధ్యక్షులు మేహరజ్, ఉద్యమ నాయకులు అబ్దుల్లా, రియాజ్‌భాయ్ మసూద్ భాయ్, జట్టు సభ్యులను సన్మానించారు. టీం ప్లేయర్స్ అసిఫ్ కెప్టెన్, మన్సూర్, నవీన్, ఆరిఫ్, సాయికిషోర్, శ్రీకాంత్, అజు, అసిఫ్ భాయ్, తహేర్, ప్రభాకర్, అఫ్రిది పాల్గొన్నారు.

◆ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ గురువారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులను కోరారు. మండలంలోని కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మునిపల్లి(అందోల్): మండలంలోని మేళసంగ్యం గ్రామంలో గురువారం కట్ట మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక కౌన్సిలర్ హన్మంత్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాన్‌లు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్ హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో వెంటనే రెండు ఫ్యాన్‌లను ఇప్పించారు.

◆ పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడు తన ఫోన్‌ను రెండు రోజుల క్రితం పోగొట్టుకున్నాడు. దీంతో ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ విజయకృష్ణ సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా ఫోన్‌ను కనుగొని శివకుమార్‌కు ఫోన్‌ను అప్పగించడంతో శివకుమార్ పోలీసులకు కృతజ్ఞతలు చెప్పాడు

◆ నేడు వ్యవసాయ న్యాయ సలహాలపై అవగాహన

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ శివారులోని రైతు వేదికలో ఈ నెల 2న శుక్రవారం 11గంటలకు రైతులకు వ్యవసాయ న్యాయ సలహాలపై అవగాహన కల్పించనున్నట్లు ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, రైతులు, హాజరు కావాలని సూచించారు.

◆ చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

జహీరాబాద్: తీవ్ర శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి జహీరాబాద్‌కు చెందిన అనంత్ సలోమి షైనీ ఆర్థికసాయం సహాయం అందజేశారు. గురువారం బీదర్‌లోని గురుపాదప్ప ఆస్పత్రికి జహీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నవీన్ కుమార్ భార్య సలోమి షైనీ వెళ్లి రూ.7,500 ఆర్థిక సహాయం అందించి బరోసా ఇచ్చారు. న్యాల్‌కల్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఇమ్రాన్ మేనల్లుడి కుటుంబం పేదరికంలో ఉండడంతో చికిత్స చేయించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ఈ మేరకు సహాయం అందజేసినట్టు సలోమి షైనీ తెలిపారు.

◆ మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో ఖాళీలు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి సీఈసీలో 15 సీట్లు, ఎంఈసీలో 20సీట్లు ఖాళీగా ఉన్నాయని అధ్యాపకులు డాక్టర్ డ్యానియెల్ తెలిపారు. ఆయా సీట్లలో ప్రవేశాలకు పదోతరగతి ఉత్తీర్ణులైన ముస్లింలు మాత్రమే అర్హులన్నారు. నాన్‌ముస్లింలకు సంబంధించి 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9866253277 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.